యాదగిరిగుట్టలో వైభవంగా లక్ష పుష్పార్చన

లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 13 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాయంలో ఆదివారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్ష పుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు సహస్రనామ పఠనాలతో అర్చకులు, వేద పండితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. స్వయంభూ ప్రధానాలయం ముఖ మండపంలో ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. ఆదివారం, దసరా సెలవులు కావడంతో స్వయంభూ నారసింహుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాఢ వీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, తిరు మాఢవీధులు, గర్భాలయం ముఖ మండపంలో భక్తుల సందడి నెలకొంది. కొండ కింద కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించి, లక్ష్మీ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి ధర్మ దర్శనానికి 2గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవను నిర్వహించారు. తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం సుదర్శన నారసింహ హోమం ఘనంగా జరిపారు. సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. అనంతరం మొదటి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. సాయంత్రం వెండి మొక్కు జోడు సేవ, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. రాత్రి స్వామి వారికి శయనోత్సవం జరిపి ఆలయానికి ద్వార బంధనం గావించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. స్వామివారిని సుమారు 20వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.29,30,290 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం విజయదశమి పురస్కరించుకుని జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాచారం వాస్తవ్యులు మల్లెల నర్సింగ్‌రావు, రేణుక దంపతులు ఐదు వెండి కలశాలను ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు అందజేశారు. విమాన గోపురానికి బంగారం తాపడానికి ఎం.నవీన్‌కుమార్ రూ.77,98,500 చెక్కు అందజేశారు.

ఊరూరా దసరా వేడుకలు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 13 : విజయ దశమి దసరా పండుగను జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. పట్నంవాసులు, బంధువుల రాకతో పల్లెల్లో సందడి నెలకొంది. పిండి వంటలతో ఘుమఘుమలాడాయి. శనివారం సాయంత్రం డప్పుచప్పుళ్లతో జమ్మి చెట్టు వద్దకు పెద్ద సంఖ్యలో వెళ్లి శమీ పూజలు చేశారు. జమ్మి ఆకును ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకొని పండుగ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. వేడుకల్లో భాగంగా పలుచోట్ల రావణాసురుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇండ్లు, వ్యాపార కేంద్రాల్లో ఆయుధ పూజలు నిర్వహించారు. భువనగిరి పట్టణంలోని నల్లగొండ చౌరస్తా సమీపంలో ఏర్పాటు చేసిన దసరా వేడుకల్లో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం రావణ దహనం చేశారు. సాయిబాబా దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పాల్గొని జమ్మి చెట్టుకు పూజలు చేశారు. వలిగొండలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆత్మకూరు(ఎం) మండలం పల్లెపహాడ్‌లో బీఆర్ఎస్ నాయకులు కోలాటం, డప్పుచప్పుళ్లతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి బురుజు వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. మోత్కూరు మండలం పొడిచేడులో 30 ఏండ్లుగా వేర్వేరుగా జరుపుకొనే దసరా పండుగను ఈసారి గ్రామస్తులంతా ఐకమత్యంతో ఒకే దగ్గర ప్రశాంతంగా జరుపుకోవడం విశేషం. ఆలేరు పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. ఆలేరు పెద్దవాగు సమీపంలో నిర్వహించిన రావణ దహనానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం సద్దుల బతుకమ్మ రోజు కౌన్సిలర్ బేతి రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో గెలుపొందిన మహిళలకు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య బహుమతులు అందజేశారు.

భువనగిరి అర్బన్ : నల్లగొండ చౌరస్తా వద్ద రావణ దహనం చేస్తున్న పట్టణ ప్రజలు

రామన్నపేట : బోగారంలో జమ్మి చెట్టు వద్ద పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి లక్ష్మణ్

దసరా వేడుకల్లో హైకోర్టు జడ్జి లక్ష్మణ్

రామన్నపేట : హైకోర్టు జడ్జి కూనూరు లక్ష్మణ్ తన స్వగ్రామం మండలంలోని బోగారంలో దసరా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. శనివారం సాయంత్రం గ్రామస్తులతో కలిసి జమ్మిచెట్టు వద్ద పూజలు చేశారు. ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేశారు. తన తల్లిదండ్రులకు జమ్మి పెట్టి ఆశీర్వచనం తీసుకున్నారు.

యాదగిరిగుట్ట : కొండపైన జమ్మి చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వలిగొండలో విజయదశమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

మోత్కూరులో జమ్మి పూజల్లో పాల్గొన్న పుర ప్రముఖులు

చౌటుప్పల్ : జమ్మి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

భువనగిరి అర్బన్ : దసరా వేడుకల్లో పట్టణ ప్రజలు

చౌటుప్పల్ రూరల్ : రావణాసుర వధకు హాజరైన జనం

భూదాన్ పోచంపల్లి : రావణాసురుడి దిష్టిబొమ్మ దహనం

ఆత్మకూరు(ఎం)లో జమ్మి చెట్టు వద్ద శమీ పూజలో పాల్గొన్న ప్రజలు

తుర్కపల్లి : మండల కేంద్రంలో జమ్మి చెట్టు వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

రాజాపేట : రఘునాథపురంలో జమ్మి చెట్టు వద్దకు డప్పుచప్పుళ్లతో వెళ్తున్న గ్రామస్తులు

ఆలేరు టౌన్ : బతుకమ్మ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ శంకరయ్య

ఆధ్యాత్మిక క్షేత్రం రమణేశ్వరం

- శ్రీచక్రాల ప్రతిష్ఠాపనతో లోకకల్యాణం : మంత్రి కొండా సురేఖ

రమణేశ్వరంలో బంగారు శివలింగానికి పూజలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 13 : రమణేశ్వరం ఆధ్యాత్మిక క్షేత్రమని, శ్రీచక్రాల స్థాపనతో లోక కల్యాణానికి నాంది పలికారని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో గల శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో చేపడుతున్న శ్రీచక్రాల ప్రతిష్ఠాపనలో భాగంగా ఆదివారం 9అడుగుల పంచలోహ శ్రీచక్ర ప్రతిష్ఠాపనలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లోక కల్యాణం కోసం రమణేశ్వరంలో శ్రీచక్రాలను ప్రతిష్ఠించడం ఎంతో గొప్ప సంకల్పమన్నారు. సిద్ధగురువు రమణానంద మహర్షి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రమణేశ్వరంలో శ్రీచక్రాల స్థాపన భక్తులతో చేపట్టామన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తభజన మండలి సభ్యులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 13 : వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలోని రాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీరామ భక్తభజన మండలి ఆధ్వర్యంలో శనివారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గోవింద నామాలతో కొండ చుట్టూ ప్రదక్షిణ చేసి వేంకటేశ్వరస్వామికి అభిషేకం, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో శ్రీరామ భక్త భజన మండలి సభ్యులు గడ్డమీది చంద్రయ్యగౌడ్, సామల శ్రీరాములు, పెద్దగాని శ్రీనివాస్, భిక్షపతి, కమలాకర్, శ్రీధర్, విరూపాక్షప్ప, భక్తులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి మోదీదే బాధ్యత

- సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు జనార్దన్, సహదేవ్

ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

ఆలేరు టౌన్, అక్టోబర్ 13 : ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ పూర్తి బాధ్యత వహించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆర్.జనార్దన్, సహదేవ్ అన్నారు. మున్సిపాలిటీలోని జాతీయ రహదారిపై ఆదివారం ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయిబాబాకు మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణతో అక్రమంగా కేసులు నమోదు చేసి తొమ్మిదేండ్లు నాగపూర్ జైల్లో బంధించారని విమర్శించారు. జైల్లో ఉన్న సమయంలో వైద్య సదుపాయం అందించకుండా అనారోగ్యానికి గురి చేసిందని మండిపడ్డారు. 90శాతం అంగవైకల్యం ఉన్న వ్యక్తిని నిర్బంధించి మానసిక, శారీరక వేదనకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, మతతత్వ భావజాలాన్ని వ్యతిరేకించిన వారిని టార్గెట్ చేయడమే బీజేపీ లక్ష్యమన్నారు. సాయిబాబా మృతికి కారణమైన బీజేపీ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లెపు అడివయ్య, పీవైఎల్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెజాడి కుమార్, నాయకులు స్వామి, కొమురయ్య, సత్యనారాయణ, శ్రీకాంత్, సిద్ధులు, భిక్షపతి పాల్గొన్నారు.

దసరా వేడుకల్లో ఇరువర్గాల ఘర్షణ

- పలువురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

తుర్కపల్లి, అక్టోబర్ 13 : దసరా పండుగ సందర్భంగా మండలంలోని చిన్న లక్ష్మాపురంలో శనివారం రాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఒక వర్గంపై మరో వర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పలువురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఎస్ఐ టకియొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న లక్ష్మాపురంలో సద్దుల బతుకమ్మ రోజు దళిత మహిళలు గ్రామ ప్రధాన కూడలి వద్దకు బతుకమ్మలతో వచ్చారు. వారిని రెడ్డి, కురుమ, వడ్డెర కులాల మహిళలు అడ్డుకొని ఎప్పటిలాగే ఎస్సీ కాలనీలోనే బతుకమ్మ జరుపుకోవాలని, ఇక్కడికి ఎందుకు వచ్చారని అడిగారు. దాంతో ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో శనివారం దసరా వేడుకల్లో ఈ అంశానికి సంబంధించి చర్చ జరిగింది. తమ కులానికి చెందిన మహిళలను ఎందుకు అవమానించారని పలువురు దళితులు ఇతర కులస్తులను నిలదీశారు. దాంతో ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగి తోపులాట జరిగింది. అదే రాత్రి కొంత మంది దళితులు తమను కులం పేరుతో దూషించారని, దాడికి పాల్పడ్డారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ టకియొద్దీన్ తన సిబ్బందితో గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. ఘర్షణకు కారణమైన దూబల ధర్మారెడ్డి, దూబల రాజిరెడ్డి, బోపనబోయిన మహేశ్, బోపనబోయిన ఐలయ్యతోపాటు మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టకియొద్దీన్ తెలిపారు.

ఘనంగా దుర్గామాత శోభాయాత్ర

చౌటుప్పల్ రూరల్ : స్వాములవారి లింగోటంలో దుర్గామాత పూజల్లో పాల్గొన్న భక్తులు

భూదాన్ పోచంపల్లి/ ఆలేరు రూరల్/ ఆత్మకూర్ (ఎం)/ బొమ్మలరామారం, చౌటుప్పల్ రూరల్/ వలిగొండ, అక్టోబర్ 13 : దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు పూర్తి కావడంతో ఆదివారం అమ్మవారి విగ్రహాల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. పోచంపల్లి మున్సిపాలిటీలో దుర్గా కమిటీ ఆధ్వర్యంలో పూలతో అలంకరించిన వాహనంపై అమ్మవారిని ఉంచి కోలాట ప్రదర్శనలు, యువకుల డ్యాన్స్ మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిమజ్జనం చేశారు. ఆలేరు మండల వ్యాప్తంగా దుర్గమాత ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని శివాలయంలో, రాంనగర్‌లోని హన్‌మాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమాత విగ్రహాల శోభాయాత్ర నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి వీర్ల చెరువులో నిమజ్జనం చేశారు. బొమ్మలామారం మండల కేంద్రంతోపాటు నాగినేనిపల్లి, తిమ్మాపురం, మర్యాల, రాంలింగంపల్లి గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను ఊరేగించి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. చౌటుప్పల్ మండలం స్వాములవారి లింగోటంలో కేఆర్‌సీ ఫౌండేషన్ చైర్మన్ కర్నె రవిచరణ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వలిగొండ మండల కేంద్రంతోపాటు నాగారం, వెల్వర్తి గ్రామాల్లో దుర్గామాత శోభాయాత్రల్లో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు.

మోటకొండూర్‌లో భారీ అగ్ని ప్రమాదం

- దగ్ధమైన హార్డ్‌వేర్ దుకాణం
- సుమారు రూ.70లక్షల నష్టం

హార్డ్‌వేర్ దుకాణంలో కాలిపోయిన వస్తువులు

మోటకొండూర్, అక్టోబర్ 13 : మండల కేంద్రంలో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. మండలంలోని గిరబోయినగూడెం గ్రామానికి చెందిన గిరబోయిన మల్లయ్య మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీబాలాజీ హార్డ్‌వేర్ దుకాణంలో దసరా పండుగ రోజు పూజ చేసి దీపం పెట్టడంతో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. గంటన్నర పాటు మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. దాంతో పక్కనే ఉన్న భూమండ్ల బుచ్చందర్ ఇంటికి మంటలు అంటుకొని సామగ్రితోపాటు విలువైన వస్తువులు కాలిపోయాయి. మరో పక్కన ఉన్న నాగిళ్ల శ్రీనివాస్ కిరాణా షాపునకు మంటలు అంటుకొని పాక్షికంగా దగ్ధమైంది. ప్రహరీ ధ్వంసమైంది. పోలీసులు, స్థానికుల సమాచారంతో రెండు ఫైరింజిన్లు వచ్చి గంటపాటు శ్రమించి మంటలను అర్పేశాయి. మంటలు పెద్ద ఎత్తున రావడంతో హార్డ్‌వేర్ దుకాణంలోని సామగ్రి పేలుడు శబ్దాలతో స్థానికులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.70లక్షల నష్టం వాట్టిలిందని బాధితులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఏసీపీ రమేశ్, ఎస్ఐ పాండు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

దుండగుల చేతిలో వాహనాలు దహనం

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 13 : మండలంలోని కూరెళ్లలో బెజ్జంకి భిక్షం తన ఇంటి ముందు నిలిపిన కారు, రెండు బైక్‌లను గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి పెట్రోల్ పోసి దహనం చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. దసరా వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం గ్రామంలోని జమ్మి చెట్టు వద్ద జరిగిన పూజ కార్యక్రమంలో కొంత మందితో గొడవ జరిగింది. కక్షతో వారే తన ఇంటి ముందు ఉన్న వాహనాలను తగులబెట్టారని భిక్షం ఆరోపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, గ్రామంలో పోలీస్ బందోబస్తు నిర్వహించామని ఎస్ఐ కృష్ణయ్య ఆదివారం తెలిపారు.

'సంక్షేమ హాస్టళ్లకు నిధులు విడుదల చేయాలి'

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్

రామన్నపేట, అక్టోబర్ 13 : సంక్షేమ హాస్టళ్లకు వెంటనే నిధులు విడుదల చేయాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేశ్, జిల్లా అధ్యక్షుడు మచ్చ సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా శాఖ, సాంఘిక సంక్షేమ శాఖల మంత్రులను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. 9నెలల నుంచి మెస్ చార్జీలు విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గురుకుల, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మెస్ చార్జీలను రూ.1500 నుంచి 4వేల రూపాయలకు పెంచాలన్నారు. నవంబర్ 22న వరంగల్‌లో నిర్వహించే విద్యార్థి యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు.

అభినయ కళాసమితి అధ్యక్షుడిగా శ్రీనివాస్

మోత్కూరు, అక్టోబర్ 13 : మోత్కూరు అభినయ కళా సమితి అధ్యక్షుడిగా అభినయ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో ఆదివారం సమితి గౌరవ సలహాదారులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, ఎస్ఎన్ చారి, డీఎన్ గౌడ్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా దొంతోజు సతీశ్‌చారి, ఎండీ జానీ, ప్రధాన కార్యదర్శిగా బుంగపట్ల యాకయ్య, సహాయ కార్యదర్శిగా గుంటి దేవా, కార్యదర్శులుగా నక్క శంకర్, డి.ఉపేంద్రాచారి ఎన్నికయ్యారు.

బైక్ ఢీకొని ఒకరు మృతి

వలిగొండ, అక్టోబర్ 13 : మండలంలోని ముద్దాపురం గ్రామ పరిధిలో శనివారం రాత్రి బైక్ ఢీకొని ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముద్దాపురం గ్రామ పరిధిలోని కొడమర్లబావికి చెందిన సూది నర్సిరెడ్డి(52), గున్నాల రక్షిత్‌రెడ్డి వేములకొండ నుంచి మోత్కూర్ వైపు బైక్‌పై వెళ్తున్నారు. ఓ వ్యక్తి అతివేగంగా బైక్ నడిపి ఢీకొట్టడంతో నర్సిరెడ్డి, రక్షిత్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా నర్సిరెడ్డి మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

రామన్నపేట, అక్టోబర్ 13 : మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రామన్నపేటకు చెందిన గాదె సాయిబాబు(30) మూడేండ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన సాయిబాబు శుక్రవారం రాత్రి అందరూ నిద్రిస్తుండగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఆండాలు ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

పారిశుధ్య కార్మికులతో అలయ్ బలయ్

ఆలేరు టౌన్, అక్టోబర్ 13 : దసరా పండుగను పురస్కరించుకొని ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య ఆదివారం పారిశుధ్య కార్మికులతో అలయ్ బలయ్ నిర్వహించారు. పండుగ సందర్భంగా పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించినందుకు కార్మికులను అభినందించారు. అనంతరం పండుగ కనుకలను అందజేశారు.

కాలుష్య పరిశ్రమ ఏర్పాటును ఆపివేయించాలి

- ఎంపీ చామల, ఎమ్మెల్యే వేములకు అఖిలపక్ష నాయకుల వినతి

ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశానికి వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

రామన్నపేట, అక్టోబర్ 13 : మండల కేంద్రంలో కాలుష్య పరిశ్రమ ఏర్పాటును ఆపివేయించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని ఆదివారం నకిరేకల్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డ్రై పోర్టు పేరుతో భూములు కొనుగోలు చేసి కాలుష్య అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయడం తగదన్నారు. ఆ పరిశ్రమతో ప్రజా ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, పంటలు నష్టపోతాయని, భవిష్యత్ తరాలు ఇబ్బందులు ఎదుర్కొంటాయని తెలిపారు. కాబట్టి పరిశ్రమ ఏర్పాటును ఆపుటకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమ ఆపేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రజాభిప్రాయ సేకరణను అందరూ వ్యతిరేకించాలని చెప్పారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు మేక అశోక్‌రెడ్డి, సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పోశబోయిన మల్లేశం, పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జెల్లెల పెంటయ్య, కోకన్వీనర్ ఎండీ రేహాన్, బాలకృష్ణ, పృథ్వీరాజ్, నర్సింహ, అక్రం, వెంకటేశం, నాసర్, ఫజల్‌బేగ్, అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, జమీరొద్దీన్, బాలరాజు, రమేశ్, శేఖర్, సహదేవ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

రామన్నపేట, అక్టోబర్ 13 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం నార్కట్‌పల్లిలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు మంచిగా పండాలని కోరారు. చిరుమర్తిని కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, నాయకులు కంభంపాటి శ్రీనివాస్, బొక్క మాధవరెడ్డి, మెట్టు మహేందర్‌రెడ్డి, కన్నెబోయిన బలరాం, మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, ఉయ్యాల భిక్షం, అవనగంటి నర్సింహ, పరమేశ్, శేఖర్, నవీన్ ఉన్నారు.

డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి నాయకుల శుభాకాంక్షలు

డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ మండల నాయకులు

మోటకొండూర్, అక్టోబర్ 13 : డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య ఆధ్వర్యంలో మండల నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దసరా శుభాకాంక్షలు తెలిపారు. మహేందర్‌రెడ్డిని కలిసిన వారిలో నార్మాల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, నాయకులు అనంతుల జంగారెడ్డి, ఎగ్గిడి కృష్ణ, జివిలిక పల్లి వెంకటేశ్, బొట్ల మహేశ్, ప్రశాంత్ ఉ